క్లుప్తంగా

ఆకుల వీర్రాజు పరామర్శ



వంగా వీరభద్రరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆకుల వీర్రాజు

ధవళేశ్వరం: వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్‌ను శనివారం డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు పరామర్శించారు. ఇటీవల ముత్యాల పోసికుమార్ మావయ్య వంగా వీరభద్రరావు ఇటీవల మృతి చెందారు. పోసికుమార్‌ను పరామర్శించిన వారిలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ముద్దాల తిరుపతిరావు (అను), హుకుంపేట సొసైటీ మాజీ చైర్మన్ కురుమళ్ల ఆంజనేయులు, జనసేన నాయకులు యడ్ల మహేష్, ఏఎంసీ డైరెక్టర్ కొప్పిశెట్టి గాంధీ, అల్లంపల్లి ప్రసాద్, దిండి జగదీష్, ఆకుల బాబు, కేవీఆర్ సాగర్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సీటీఆర్ఐ: స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహిళలకు కుట్టు శిక్షణ, మగ్గం, బ్యూటీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నిర్వాహకులు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కుట్టు, మగ్గం, బ్యూటీషన్ కోర్సుల్లో మహిళలకు మాత్రమే ప్రవేశం ఉంటుందని ప్రవేశం ఉంటుందన్నారు. సెప్టెంబర్ 22 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని, మెటీరియల్, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు లాలాచెరువు వద్ద స్వర్ణాంధ్ర సంస్థను స్వయంగా లేదా 9849847489 ఫోన్ ద్వారా సంప్రదించాలని కోరారు.

హోంగార్డు డీఎస్పీ కిరణ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



ఎస్పీ నరసింహకిశోర్‌ను కలిసిన హోంగార్డు డీఎస్పీ కిరణ్‌కుమార్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): తూర్పు గోదావరి జిల్లా హోంగార్డు డీఎస్పీగా పి.కిరణ్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్పీ డి.నరసింహ కిశోర్‌ను మర్యాదపూర్వకంగా కలసి పూల మొక్కను అందజేశారు. 1996 బ్యాచ్‌కు చెందిన పి. కిరణ్‌కుమార్ సాధారణ బదిలీలో భాగంగా హోంగార్డు డీఎస్పీగా జిల్లాకు వచ్చారు.

15 నుంచి ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

కంబాలచెరువు: ఏఐసీటీఈ, అటల్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాలలో ఆరు రోజుల పాటు నిర్వహించనున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఈనెల 15 నుంచి ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే శనివారం తెలిపారు. రేర్ ఎర్త్స్ అండ్ అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్, క్రిటికల్ మినరల్స్‌పై శిక్షణ కార్యక్రమం ఆన్‌లైన్ ద్వారా కొనసాగుతుందన్నారు. అధ్యాపకులు, పీజీ విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు, పారిశ్రామికవేత్తలకు ఈ శిక్షణ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రోగ్రాం కోఆర్డినేటర్లు డాక్టర్ పి.సురేఖ, డాక్టర్ డి.సంజీవ్ తెలిపారు. 13 మంది జాతీయ, అంతర్జాతీయ నిపుణులు ఉపన్యాసాలిస్తారని తెలిపారు. కార్యక్రమం కన్వీనర్లుగా టి శ్రీనివాసరావు, డాక్టర్ సీహెచ్ కామన్ లక్ష్మి, బి.వెంకట్రావు, అన్నపూర్ణ, రాజేశ్వరి వ్యవహరిస్తున్నారన్నారు.

సినిమాలు



శ్యామల	: కిష్కింధపురి
సూర్యమినీ	: ది కంజూరింగ్ , ఘాటీ
సూర్యప్యాలెస్	: డీమోన్ స్లేయర్
స్వామి	: మిరాయ్
అనుశ్రీ	: మిరాయ్
శివజ్యోతి	: కిష్కింధపురి
రాజా	: మిరాయ్
ఊర్వశి	: లిటిల్‌హార్ట్స్, మహావతార్ నరసింహ
మేనక	: కిష్కింధపురి
రంభ	: మిరాయ్
అప్సర	: కొత్తలోక
అశోక	: మదరాసి, డీమోన్ స్లేయర్
నామవరం	
వీఎస్ మహల్	: మిరాయ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: మిరాయ్
కడియం	
వెంకటసూర్య	: మిరాయ్

రోడ్లు అధ్వానం... ఒళ్లు హూనం

- రూరల్ నియోజకవర్గంలో గోతులమయంగా రోడ్లు
- గోతులను గుర్తించలేక ప్రమాదాలు
- తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని వాహనచోదకుల విజ్ఞప్తి



గోతులమయంగా కడియం - వీరవరం రోడ్డు



బొమ్మూరు నుంచి బాలాజీపేట రోడ్డులో భారీ గొయ్యి

రాజమహేంద్రవరం రూరల్: ప్రధాన రహదారులు ఛిద్రమై గోతులమయంగా మారి ప్రమాదకరంగా ఉన్నాయి. రాత్రి సమయాల్లో గోతులు కనపడక ప్రజలు ప్రమాదాల బారినపడుతున్నారు. గోతులను సకాలంలో పూడ్చించాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నియోజకవర్గం పరిధిలో రాజమహేంద్రవరం రూరల్, కడియం మండలంలోని ప్రధాన రహదారులు ఎక్కడ చూసినా అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ గోతులు మరింత దారుణంగా తయారయ్యాయి. బొమ్మూరు బాలాజీపేట రోడ్డు, ఐఎల్‌టీడీ జంక్షన్ నుంచి ఫ్లైఓవర్‌కు వచ్చే రహదారి, బొమ్మూరు నుంచి రాజవోలు రోడ్డులో, కాతేరు ప్రధాన రహదారి, కొంతమూరు ఎయిర్‌పోర్టు రోడ్డులో భారీ గోతులు దర్శనమిస్తున్నాయి. కడియం మండలంలో వీరవరం నుంచి దుళ్ల రోడ్డుతోపాటు పలు రోడ్లు ఛిద్రమై ప్రమాదకరంగా మారాయి.

కూటమి ప్రచార ఆర్భాటం... ఆచరణలో వెనకడుగు

కూటమి ప్రభుత్వం రోడ్లపై గోతులను పూడ్చివేసి పల్లెలకు పండుగ తీసుకువచ్చాం అంటూ ప్రకటనలకే పరిమితమయ్యారే తప్ప కార్యాచరణలో మాత్రం వెనుబడే ఉన్నారు. రోడ్లపై ఇటీవల ఏర్పడిన గోతుల వలన వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికారులు, ప్రజాప్రతినిధుల్లో మాత్రం ఎటువంటి చలనం లేదు. కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటంలో చూపిస్తున్న శ్రద్ధ ప్రజలు ఇబ్బందులపై మాత్రం దృష్టి పెట్టడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లపై పడిన గోతులను త్వరితగతిన పూడ్చించాలని, అవసరమైన చోట రోడ్లను పునర్నిర్మించాలని వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు.

గోతులను పూడ్చించాలి

నియోజకవర్గంలో ఎక్కడ చూసినా గోతులు దర్శనమిస్తున్నాయి. రాత్రి సమయాల్లో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లపై గోతులను పూడ్చించాలి.

–అప్పా బాబి, బొమ్మూరు





కాతేరు రోడ్డులో గొయ్యి

కలెక్టర్ కీర్తి చేకూరిని కలిసిన అధికారులు



కలెక్టర్ కీర్తి చేకూరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాష్ట్ర పంచాయతీ రాజ్ గెజిటెడ్ అధికారుల సంఘ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: తూర్పుగోదావరి జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కీర్తి చేకూరిని శనివారం రాష్ట్ర పంచాయతీ రాజ్ గెజిటెడ్ అధికారుల సంఘం జనరల్ సెక్రటరీ, సామర్లకోట ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ కేఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.సంఘ రాష్ట్ర కన్వీనర్, హౌసింగ్ పీడీ నాతి బుజ్జి, గ్రామ వార్డు సచివాలయ జిల్లా అధికారిణి వీణాదేవి, డ్వామా పీడీ మహేష్ కుమార్, జిల్లా విజిలెన్స్ అధికారి రత్నకుమారి, డీపీఓ శాంతామణి, డీఆర్డీఏ పీడీ మూర్తి, డ్వామా ఏఓ కిషోర్ కుమార్, ఈటీసీ సీనియర్ ఫ్యాకల్టీ శ్రీనివాస్, ఏపీడీ రాంప్రసాద్, ఎస్.ఎస్.ఏ పీఓ సుభాషిణి, ఎంపీడీఓలు జాన్సీ, రమేష్, ఆర్మ్ స్ట్రాంగ్, భారతి, సాయిబాబా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెల్లుబోయిన పరామర్శ



పడాల ప్రసాద్, నరసింహారావును పరామర్శిస్తున్న చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: మాతృవియోగంతో బాధపడుతున్న కోలమూరు వైఎస్సార్ సీపీ నాయకులు, పడాల ప్రసాద్, మాజీ సొసైటీ అధ్యక్షుడు పడాల నరసింహారావును శనివారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు పరామర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన పడాల సావిత్రి చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి ఎంఎం ఆలీ, మాజీ ఉప సర్పంచ్‌లు చెరుకూరి సత్యనారాయణ, మౌలాలి, జిల్లా కార్యదర్శులు తాటికొండ విష్ణు, ముద్దాల అను, పరిమి దుర్గారావు, పిన్నమరెడ్డి సూర్యచంద్రం, తీటి ప్రసాద్, లాయర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమస్యలపై గళమెత్తాలి

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలతో వంచించిందని, కావున మహిళా సమస్యలపై ఎప్పటికప్పుడు గళమెత్తాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మహిళా నేతలకు సూచించారు. శనివారం బొమ్మూరులోని పార్టీ కార్యాలయంలో చెల్లుబోయిన వేణును వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ మహిళా విభాగ అధ్యక్షురాలిగా నియమితులైన ఆచంట మారుతిదేవి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గంలో మహిళా నేతలను కలుపుకుని మహిళా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. చంద్రబాబు కూటమి ప్రభుత్వం మోసాలను ప్రజల్లోకి వెళ్లి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పబ్లిసిటీ విభాగం అధ్యక్షుడు ఆచంట కల్యాణ్, ఆచంట రవీంద్రరావు, మద్దా దుర్గారావు, కొల్లినాని, యండమూరి సుబ్బలక్ష్మి, వీణం దేవి పాల్గొన్నారు.

పీటీఐలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేష్

సీటీఆర్ఐ: పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్ (పీటీఐ)లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, తక్షణమే జీతాలు విడుదల చేయాలని, పీటీఐ జిల్లా అధ్యక్షుడు రామవరపు వెంకటేష్ కోరారు. శనివారం స్థానిక స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో నిర్వహించిన జిల్లా పీటీఐల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీటీఐలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జీతాల బడ్జెట్ ప్రతి నెల కాకుండా ఏడాదికి ఒకేసారి విడుదల చేయాలని, గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. స్వర్ణాంధ్ర సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గుబ్బల రాంబాబు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పీటీఐలకు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఇద్వా జిల్లా అధ్యక్షురాలు తులసి మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి పీటీఐ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. పీటీఐ మాజీ అధ్యక్షుడు జాకబ్ రాజు మాట్లాడుతూ సమ్మె హామీలు తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు దుర్గాప్రసాద్, కార్యదర్శి మిరప రాజు, సత్యానందం, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే...



ధవళేశ్వరం రాఘవేంద్ర స్వామి ఆలయం ఎదుట మూడు రోడ్ల కూడలిలో భారీ గొయ్యి

ధవళేశ్వరం: నిత్యం రద్దీగా ఉండే మూడు రోడ్ల కూడలి అది. క్వారీ రోడ్డు నుంచి మార్కెట్ వైపుకు వెళ్లాలన్నా, స్టేట్ బ్యాంకు వైపునకు వెళ్లాలన్నా ప్రధాన మార్గం ఇదే. మూడు రోడ్ల కూడలి రాఘవేంద్ర స్వామి ఆలయం ఎదుట భారీ గొయ్యి ఏర్పడటంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షానికి ఇక్కడ నీరు నిలిచి భారీ గొయ్యి ఏర్పడటంతో అనేక మంది దీనిని గుర్తించలేక ఇందులో పడి గాయాల పాలవ్వడం పరిపాటిగా మారింది. మూడు రోడ్ల కూడలిలో ఏర్పడిన భారీ గొయ్యి పూడ్చాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రమాదాలను నివారించేందుకు వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సుంకర సేవలు చిరస్మరణీయం



ఎస్‌బీఆర్ స్మారక క్రీడా పురస్కారాలు అందుకుంటున్న క్రీడా అధ్యాపకులు

సీటీఆర్ఐ: క్రీడాభివృద్ధికి సంకర భాస్కరరావు అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు క్రీడాకారులు కొనియాడారు. శనివారం స్థానిక దానవాయిపేట గానుగ వీధిలో సుంకర భాస్కరరావు క్రీడా పరిశోధనాభివృద్ధి కేంద్రంలో తూర్పుగోదావరి వ్యాయామ అధ్యాపకుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ ఫుట్‌బాల్ క్రీడాకారుడు, ఆంధ్ర రాష్ట్ర ఫుట్‌బాల్ క్రీడా పితామహునిగా ఖ్యాతి గాంచిన సుంకర భాస్కరరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. రాజమండ్రిలో పొట్టి శ్రీరాములు, డాక్టర్ సుంకర స్వామినాయుడు ఆల్ ఇండియా గోల్డ్ కప్ టోర్నమెంట్స్, ఇండియా– స్వీడెన్ మహిళల అంతర్జాతీయ ఫుట్‌బాల్ మ్యాచ్ లాంటి ఎన్నో క్రీడాకార్యక్రమాలను నిర్వహించేవారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత హాకీ క్రీడాకారులు జి. వినోద్ బాబు, జెడ్పీ హైస్కూల్ వ్యాయామ అధ్యాపకురాలు జి.ఉమారాణికి సుంకర భాస్కరరావు స్మారక క్రీడా పురస్కారంతో సత్కరించారు. రోబ్బి సన్యాసిరావు, జిల్లా వ్యాయామ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు ఎస్.నాగరాజు, ప్రముఖ చేతి రాత నిపుణులు ఎస్. రాజేష్ ఖన్నా పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో విజేత కేకేడీ కింగ్స్ జట్టు

హోరాహోరీగా ఫొటోగ్రాఫర్ల క్రికెట్ పోటీలు

కోరుకొండ: రాజమహేంద్రవరం లూథర్‌గిరిలో ఐదురోజులుగా కొనసాగుతున్న ఫొటోగ్రాఫర్ల క్రికెట్ పోటీల్లో భాగంగా శనివారం నిర్వహించిన ఫైనల్స్‌లో కోరుకొండకు చెందిన (ఫొటోగ్రాఫర్స్) కేకేడీ కింగ్స్ జట్టు విజేతగా నిలిచి ట్రోఫీని కైవశం చేసుకుంది. రాజమహేంద్రవరానికి చెందిన రాయల్ హంటర్స్ జట్టుపై 14 పరుగుల తేడాలో విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో రాజమహేంద్రవరం జోన్ పరిధిలోని 8 జట్లు తలపడగా, కేకేడీ కింగ్స్ జట్టు విజేతగా, రాజమహేంద్రవరం రాయల్ హంటర్ జట్టు రన్నర్‌గా నిలిచాయి. పోటీల్లో కేకేడీ కింగ్స్ జట్టుకు చెందిన అఖిల్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు ఎంపికయ్యాడు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా కిషోర్ నిలిచాడు. కెప్టెన్ కట్టా సూరిబాబు జట్టును చాకచక్యంగా నడిపించడంతో క్రీడాకారులంతా ప్రతిభను కనబర్చారు. గోదావరి ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్ల యానియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విజేత జట్టు కోరుకొండ టీమ్ కెప్టెన్ కట్టా సూరిబాబు పలువురు క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సత్కారం



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న గౌరీశంకరరావు తదితరులు

కంబాలచెరువు: అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయని సమగ్ర శిక్షా జిల్లా జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డి.గౌరీశంకరరావు అన్నారు. టీచర్స్ డే సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న మోటూరి మంగా రాణి, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న చేవూరి శ్రావణ్ గౌతమ్‌కృష్ణను లాలా చెరువు ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన సభలో ఆయన అభినందించారు. ఈ సందర్భంగా గౌరీ శంకర రావు మాట్లాడుతూ మంగారాణి, గౌతమ్‌కృష్ణ సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే శిక్షణ కార్యక్రమాలకు రిసోర్స్ పర్సన్లు వ్యవహరిస్తూ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించేవారన్నారు. కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కాకినాడ జిల్లాలకు రిసోర్స్‌పర్సన్లు అంతా కలసి ఈ అభినందన సభ ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ప్రథమ్ జిల్లా కో ఆర్డినేటర్ అనూష, లాలాచెరువు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని యు.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



రామేశ్వరంలో యూత్ ఎంపవర్‌మెంట్ కార్యక్రమంలో మాట్లాడుతున్న సుసి ఆదిత్యకుమారి

పెదపూడి: యువత అభ్యసిస్తున్న విద్యలో నైపుణ్యాలను పెంపొందించుకుని ఉన్నత లక్ష్యాలు సాధించాలని కాకినాడ మైత్రేయి ఉమెన్ ఆర్గనైజేషన్ ఫౌండర్ అధ్యక్షురాలు, వినియోగదారుల కోర్టు మెంబర్ చక్కా సుసి ఆదిత్య కుమారి అన్నారు. రామేశ్వరంలో కాకినాడకు చెందిన బాలాజీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యూత్ ఎంపవర్‌మెంట్ కార్యక్రమం సర్పంచ్ కొటికలపూడి చినబాబు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుసి ఆదిత్య కుమారి, కాకినాడ శ్యామ్ ఇనిస్టిట్యూట్ ఫౌండర్ చైర్మన్ జి.శ్యామ్, అడ్వకేట్ సయ్యద్ సలార్, ఎస్సై ఎస్.తులసిరామ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుసి ఆదిత్యకుమారి మాట్లాడుతూ యువత నైతిక విలువలు పెంపొందించుకోవాలన్నారు. యువత ఆత్మవిశ్వాసంతో వారి శక్తి సామర్థ్యాలపై నమ్మకంతో ముందడగు వేసి మంచి భవిష్యత్తు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అడ్వకేట్ సయ్యద్ సలార్ మాట్లాడుతూ యువత నిర్దిష్టమైన లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని వాటి సాధనకు శ్రమించాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్, అడ్వకేట్ గునిపే బాలాజి పాల్గొన్నారు.

శంభాజీరావు సేవలు ఎనలేనివి



శంభాజీరావు కుమారుడు చంద్రమౌళిని పరామర్శిస్తున్న జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు మాజీ సర్పంచ్ మద్దిపోటి శంభాజీరావు గ్రామాభివృద్ధికి చేసిన సేవలు ఎనలేనివని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు జక్కంపూడి రాజా కొనియాడారు. ఇటీవల శంభాజీరావు మృతిచెందడంతో ఆయన కుటుంబ సభ్యులను శనివారం జక్కంపూడి రాజా పరామర్శించారు. శంభాజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం శంభాజీరావు సతీమణి మాజీ సర్పంచ్ గంగాభవాని, కుమారుడు చంద్రమౌళి తదితరులను పరామర్శించారు. బొమ్మూరు మురళీకొండపై ఏపీడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు మండేలా శ్రీరామ్మూర్తిని జక్కంపూడి రాజా పరామర్శించారు. ఇటీవల ఆయన కుమార్తె మృతిచెందిన విషయం తెలిసిందే.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల వితరణ

కడియం: స్థానిక వ్యాపారి తామెళ్ల వేంకటేశ్వరరావు 25 మంది పారిశుధ్య కార్మికులకు శనివారం దుస్తులు అందజేయడంతోపాటు వారికి భోజనం ఏర్పాటు చేశారు. తన తండ్రి దివంగత బాపిరాజు వర్ధంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించినట్టు ఆయన తెలిపారు.

గణపతి మండపాల వద్ద అన్నదానం

కడియం: గణపతి ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో శనివారం కడియంలోని భాస్కర్‌రామ్‌నగర్, జనార్ధన స్వామి ఆలయం వద్ద మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, యువత పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థికి వీల్ చైర్ అందజేత



విద్యార్థి మహ్మద్‌కు వీల్‌చైర్ అందజేసిన డాక్టర్ కె.రవీంద్రనాథ్, స్వాతి తదితరులు

కంబాలచెరువు: ఆర్‌ఎస్ స్వేచ్ఛ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం దానవాయి పేట మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన వికలాంగ విద్యార్థి మహ్మద్ అబు కిజర్ ఖురేషీకి దానవాయిపేట ఆర్‌ఎస్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ కె.రవీంద్రనాథ్, నిర్వాహకురాలు కె స్వాతి వీల్ చైర్ అందజేశారు.పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు అభ్యర్థన మేరకు ఆ విద్యార్థికి ఈ వీల్ చైర్ అందజేసినట్లు స్వాతి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎమ్ హెచ్ స్కూల్ ఉపాధ్యాయులు ఎల్ ప్రభాకరరావు, పి నిర్మల కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పీపీపీ లీజు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వ వైద్య కళాశాలల పీపీపీ లీజు నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు రెవ.విజయసారథి డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, మధ్య తరగతి విద్యార్థుల కోసం ఎంతో గొప్ప ఆలోచనతో రాష్ట్రానికి 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను తీసుకువచ్చారని ఆయన తెలిపారు. వాటిలో ఐదు కళాశాలలను గత ప్రభుత్వంలోనే ప్రారంభించి ఎంతోమంది పేద విద్యార్థుల కలలను నిజం చేశారన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో డాక్టర్ విద్యనభ్యసించాలన్న పేద, మధ్యతరగతి విద్యార్థుల ఆశలను పీపీపీ లీజు పేరుతో కూటమి ప్రభుత్వం నాశనం చేస్తోందని దుయ్యబట్టారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని రాష్ట్రంలోని క్రైస్తవులందరూ వ్యతిరేకిస్తున్నారన్నారు. ఈ ప్రైవేటీకరణ ఆలోచనను కూటమి ప్రభుత్వం మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు యువత నుంచి ఎదుర్కోవాల్సి వస్తుందని రెవ.విజయసారధి హెచ్చరించారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

అనపర్తి : జాతీయ పశు వ్యాధి నివారణలో భాగంగా పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్టు అనపర్తి పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ వై.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి అక్టోబర్ 15 వరకు నెల రోజుల పాటు నియోజకవర్గంలోని అన్ని పశువైద్యశాలల పరిధిలో ఈ కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి పశువులకు టీకాలు వేస్తారని తెలిపారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో మరణాల సంఖ్య తక్కువ ఉన్నప్పటికీ పాల దిగుబడి సామర్థ్యం తగ్గుతుందని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా అందించే గాలికుంటు వ్యాధి టీకాలను తప్పనిసరిగా పశువులకు వేయించుకోవాలని ఆయన సూచించారు. ఆయా మండలాల్లోని పశు వైద్యశాలలు, రైతు సేవా కేంద్రాల్లో ఈ టీకాలు అందుబాటులో ఉంటాయని డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు.